# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం - 02- సెప్టెంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 90 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in




## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు హైకోర్టులో ఊరట

- రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా డివిజన్ బెంచ్ తీర్పు
- సింగిల్ జడ్జి విధించిన మధ్యంతర స్టే రద్దు
- పథకాల అమలుకు మార్గం సుగమం
- రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగనున్న సంక్షేమ పథకాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలో అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో కీలక ఊరట లభించింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ జడ్జి జారీ చేసిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ సంక్షేమ పథకాల కొనసాగింపునకు న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి

మిగతా 2లో

## ఢిల్లీకి మంత్రి కొండా సురేఖ.. కాంగ్రెస్‌లో ఉత్కంఠ

అధిష్ఠానం అత్యవసర పిలుపుతో హస్తినకు ప్రయాణం

కేసీ వేణుగోపాల్, ఖర్గేతో భేటీకి సన్నాహాలు

షోకాజ్ నోటీసుల నేపథ్యంలో కీలక పరిణామాలు

హైకమాండ్ నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ వ్యవహారం మరోసారి రాజకీయ చర్చలకు కేంద్రబిందువుగా మారింది. తాజా పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖ హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చిన అత్యవసర పిలుపు మేరకు ఆమె హస్తినకు వెళ్లినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ పర్యటనలో భాగంగా పార్టీ జాతీయ నాయకత్వంతో ఆమె కీలక సమావేశాలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఢిల్లీ పర్యటన సందర్భంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కొండా సురేఖ ప్రత్యేకంగా సమావేశం కానున్నారని తెలుస్తోంది.

మిగతా 2లో



## క్రిటికల్ మినరల్స్ రంగంలో పరిశోధనలకు త్రిముఖ భాగస్వామ్యం బలోపేతం

- మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి ప్రతినిధులతో భట్టి సమావేశం
- క్రిటికల్ మినరల్స్ పరిశోధన, అన్వేషణకు ప్రాధాన్యం
- అధునాతన వెలికితీత, శుద్ధి సాంకేతికతల అభివృద్ధిపై దృష్టి
- తెలంగాణను గ్లోబల్ మినరల్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

2లో

## ప్రపంచ స్థాయి విద్యా కేంద్రంగా హైదరాబాద్

**గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కీలక ముందడుగు: సీఎం రేవంత్ రెడ్డి**

యూనివర్సిటీ ఆఫ్ లండన్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ క్యాంపస్‌ల ఏర్పాటు

హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్‌తో సానుకూల చర్చలు

యువతకు ప్రపంచ స్థాయి విద్య, నైపుణ్య అవకాశాల కల్పన

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న తెలంగాణ ప్రభుత్వ దృష్టికి అంతర్జాతీయ గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్య, నైపుణ్యాభివృద్ధి, క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థలు తెలంగాణతో భాగస్వామ్యం కావడానికి ముందుకు రావడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన అన్నారు. బ్రిటన్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ లండన్, అమెరికాలోని బోస్టన్‌కు చెందిన నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు.

మిగతా 2లో





## రేవంత్ వ్యాఖ్యలను ఖండించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

- కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు
- ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారన్న బీఆర్ఎస్
- కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ కోసం వీరోచితంగా పోరాడి రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. రాజకీయ విభేదాలు ఉండవచ్చని, అయితే ప్రజా జీవితంలో ఉన్న నాయకుల గురించి మాట్లాడేటప్పుడు హుందాతనం పాటించాల్సిన అవసరం ఉందన్నారు.

మిగతా 2లో




## గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం

- మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన సమావేశం
- ఉత్సవ కమిటీలు, అధికారులతో విస్తృత చర్చ
- నిమజ్జన భద్రతా ఏర్పాట్లపై డీజీపీ సూచనలు
- శాఖల సమన్వయంతో విజయవంతమైన నిర్వహణకు కార్యాచరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, పోలీసు కమిషనర్లు, మున్సిపల్ అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీలు, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఉత్సవాల నిర్వహణ, భద్రతా చర్యలు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై సమావేశంలో సమగ్ర చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు రాష్ట్ర ప్రజల విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తాయని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి మండపం వద్ద భద్రత, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో

## వెయ్యి రోజుల ప్రజా పాలనలో ఆర్టీసీకి కొత్త ఊపు

- మహాలక్ష్మి పథకంతో మహిళలకు భారీ ప్రయోజనం
- విద్యుత్ బస్సులు, కొత్త సేవలతో రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు
- ఉద్యోగుల సంక్షేమం, భారీ నియామకాలపై ప్రత్యేక దృష్టి
- దేశంలోనే అగ్రగామిగా తెలంగాణ ఆర్టీసీ: మంత్రి పొన్నం

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రవాణా శాఖ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సాధించిన ప్రగతిని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించామని తెలిపారు.

మిగతా 2లో





## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన మంత్రి

**ములుగు, మల్లంపల్లి మండలాల్లో 2,430 రేషన్ కార్డుల అందజేత**

**క్యూఆర్ కోడ్‌తో ఆధునిక స్మార్ట్ కార్డుల పంపిణీ**

**పేదల ఆర్థిక భారాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సీతక్క**

**అర్హులందరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు**

ములుగు, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):

పేదల సామాజిక గౌరవానికి ప్రతీకగా నిలిచే నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ములుగు జిల్లా ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంత్రి అనసూయ సీతక్క పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావుతో కలిసి ములుగు, మల్లంపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన ఆధునిక రేషన్ కార్డులను అందజేశారు. ములుగు మండలానికి 1,809, మల్లంపల్లి మండలానికి 621 చొప్పున మొత్తం 2,430 కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రపంచ స్థాయి విద్యా కేంద్రంగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ స్థాయి విద్యను తెలంగాణ యువతకు అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రభుత్వ ప్రయత్నాలకు ఇది కీలక ఫలితమని పేర్కొన్నారు. విదేశాలకు వెళ్లకుండానే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను హైదరాబాద్‌లోనే అభ్యసించే అవకాశం యువతకు లభించనుందని తెలిపారు.

ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీతో పాటు దాని అనుబంధ విద్యా విభాగాలు తెలంగాణలో ప్రత్యేక కోర్సులు, ఎంపిక చేసిన విద్యా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆసక్తి చూపుతున్నాయని సీఎం వెల్లడించారు. అలాగే ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (సోఆస్), ఇంపీరియల్ కాలేజ్ లండన్, లండన్ బిజినెస్ స్కూల్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వంటి ప్రముఖ విద్యాసంస్థలతో జరిగిన చర్చలు కూడా సానుకూల ఫలితాలు ఇచ్చాయని తెలిపారు. అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)తో పాటు పలు ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలతో నిర్వహించిన సమావేశాలు కూడా ఆశాజనకంగా సాగాయని సీఎం పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణ యువత ప్రపంచ స్థాయి విద్య, పరిశోధన అవకాశాలను తమ స్వరాష్ట్రంలోనే పొందగలరని చెప్పారు. విద్యా రంగంలో తెలంగాణను అంతర్జాతీయంగా మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

విద్యా కోర్సులు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు, సంయుక్త పరిశోధనలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు, వివిధ రంగాల నిపుణులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు వంటి అంశాల్లో అంతర్జాతీయ సంస్థలతో కలిసి పనిచేయనున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ చర్యల ద్వారా రాష్ట్రంలో విద్యా, పరిశోధన రంగాలు మరింత బలోపేతం అవుతాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణ యువతను ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనే స్థాయికి తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నైపుణ్యాలు, క్రీడలు, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం ఇస్తూ హైదరాబాద్‌ను ప్రపంచ విద్యా శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాల సాధనలో ఈ భాగస్వామ్యాలు కీలక పాత్ర పోషించనున్నాయని ఆయన తెలిపారు.

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు హైకోర్టులో ఊరట

(మొదటి పేజీ తరువాయి)

2014నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్ ఈ పథకాల లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని పేర్కొన్నారు. అదేవిధంగా ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలకు సంబంధించిన ఇలాంటి అంశాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాల్సి ఉంటుందని అడ్వకేట్ జనరల్ వాదించారు. షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాల అమలుకు గతంలో సుప్రీంకోర్టు కూడా అనుమతినిచ్చిన విషయాన్ని ఆయన కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

ప్రభుత్వం తరఫున వినిపించిన వాదనలను పరిశీలించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి జారీ చేసిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పు వెలువరించింది. సంక్షేమ పథకాల అమలుపై తక్షణ ప్రభావం చూపే విధంగా ఇచ్చిన స్టే ఉత్తర్వులు కొనసాగించడం సమంజసం కాదని కోర్టు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. హైకోర్టు తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు యథావిధిగా కొనసాగనుంది. ఈ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వేలాది కుటుంబాలకు ఊరట లభించినట్లు ప్రభుత్వం భావిస్తోంది. డివిజన్ బెంచ్ తీర్పుతో పథకాల అమలుపై నెలకొన్న అనిశ్చితికి తెరపడింది.

# గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనాల నిర్వహణలో పోలీసు శాఖకు ఉన్న అనుభవాన్ని వివరించారు. నగరంలో అనేకసార్లు గణేష్ నిమజ్జనాల బందోబస్తు నిర్వహించిన అనుభవంతో భద్రతా ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. నిమజ్జన ప్రక్రియను దశలవారీగా నిర్వహిస్తూ ప్రతి దశలో ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. ఉత్సవ కమిటీలు కూడా పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ నిబంధనలను పాటించాలని సూచించారు. మండపాల వద్ద భక్తుల రద్దీ నియంత్రణ, విద్యుత్ భద్రత, అగ్నిప్రమాదాల నివారణ, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించి ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ సూచించారు. ముఖ్యంగా భారీ విగ్రహాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు.

నిమజ్జన ఘాట్ల వద్ద క్రేన్ల ఏర్పాటు, రవాణా సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్య చర్యలు, వైద్య సేవలపై సంబంధిత శాఖల అధికారులు తమ కార్యాచరణను వివరించారు. ఖైరతాబాద్ సహా ప్రధాన గణేష్ విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. పోలీసు, మున్సిపల్, విద్యుత్, రవాణా శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని సమావేశంలో సూచించారు. సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పలు సమస్యలు, సందేహాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వాటిపై సంబంధిత శాఖల అధికారులు స్పందించారు. గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో ఈ ఏడాది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన మంత్రి

(మొదటి పేజీ తరువాయి)



ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రేషన్ కార్డులు లేక అర్హులైన పేద కుటుంబాలు సన్నబియ్యం పథకానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం కొత్త కార్డులను మంజూరు చేస్తోందన్నారు. ఈ ఏడాది జిల్లాలో 12,802 కొత్త రేషన్ కార్డుల ద్వారా 36,405 మంది కుటుంబ సభ్యులకు సన్నబియ్యం పథకం ప్రయోజనం అందుతున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

మార్కెట్‌లో సన్నబియ్యం కొనుగోలు చేయడం పేద కుటుంబాలకు భారంగా మారుతోందని, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందించడం వల్ల వారికి ఆర్థికంగా ఊరట కలుగుతోందని మంత్రి పేర్కొన్నారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గతంలో పెద్ద పరిమాణంలో ఉండే రేషన్ కార్డులను తీసుకెళ్లడంలో ఇబ్బందులు ఉండేవని, ప్రస్తుతం జేబులో సులభంగా తీసుకెళ్లే విధంగా స్మార్ట్ కార్డులను రూపొందించామని తెలిపారు. రేషన్ సరుకుల పొందికతో పాటు వివిధ ధ్రువపత్రాల జారీ, ఆరోగ్యశ్రీ సేవలు మరియు ఇతర ప్రభుత్వ అవసరాలకు కూడా ఈ కార్డులు ఉపయోగపడతాయని వివరించారు.

అర్హులైన పేదలకు ప్రాధాన్యతనిస్తూ కొత్త రేషన్ కార్డులను అందిస్తున్నామని, ఇంకా కార్డులు అందని అర్హులకు కూడా రానున్న రోజుల్లో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రతి అర్హ కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల ద్వారా పేదలకు ప్రత్యక్ష ప్రయోజనాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జీ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ చంద్రకళ, జిల్లా అధికారులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీకి మంత్రి కొండా సురేఖ.. కాంగ్రెస్‌లో ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసేందుకు కూడా ఆమె అపాయింట్‌మెంట్ కోరినట్లు సమాచారం. తెలంగాణలో చోటుచేసుకున్న తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఈ సమావేశాల్లో చర్చ జరిగే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిలను ఉద్దేశించి ఆమె చేసిన వ్యాఖ్యలను పార్టీ క్రమశిక్షణ కమిటీ తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలపై చర్చకు కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సుస్మిత వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కోరగా, కొండా సురేఖ ఇప్పటికే కమిటీ ఛైర్మన్ మల్లు రవికి తన వివరణను సమర్పించినట్లు సమాచారం. ఆమె ఇచ్చిన వివరణను పార్టీ నాయకత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

అదే సమయంలో వనపర్తి వ్యవహారానికి సంబంధించి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన సమగ్ర నివేదికను కూడా టీపీసీసీ అధిష్ఠానానికి పంపింది. కొండా సురేఖ వివరణతో పాటు ఈ నివేదికలు కూడా కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం పరిశీలనకు వెళ్లినట్లు సమాచారం. ఈ నివేదికలు చేరిన వెంటనే సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు రావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కొండా సురేఖ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘన అంశాన్ని హైకమాండ్ ఎలా పరిగణిస్తుందో, ఈ వ్యవహారంలో ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఢిల్లీలో జరిగే సమావేశాల అనంతరం ఈ వ్యవహారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని

# రేవంత్ వ్యాఖ్యలను ఖండించిన ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి అనుచితమైన, అభ్యంతరకరమైన భాష ఉపయోగించడం బాధాకరమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించిన వ్యక్తిపై వ్యక్తిగత విమర్శలు చేయడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని అన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు విధానాలపై ఉండాలే గానీ వ్యక్తిగత దూషణల రూపంలో ఉండకూడదని సూచించారు.

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో పలు సమస్యలను ఎదుర్కొంటోందని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం, ప్రతిపక్ష నాయకులపై విమర్శలకే పరిమితమవుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమాధానాలు కోరుతున్నారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడే విషయాల్లో వాస్తవాల కంటే రాజకీయ ఆరోపణలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటోందని ఆయన అన్నారు. ప్రజలు అన్ని విషయాలను నిశితంగా గమనిస్తున్నారని, అసత్య ప్రచారాలను నమ్మే పరిస్థితిలో లేరని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ కార్యక్రమాల వేదికలను రాజకీయ విమర్శలకు ఉపయోగించడం సరికాదని అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ ఖర్చుతో నిర్వహించే సభల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులపై విమర్శలు చేసినంత మాత్రాన ప్రజలు వాటిని నమ్మరని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ప్రజలు నాయకుల పనితీరు, గత పాలన, ప్రస్తుత పరిస్థితులను బేరీజు వేసుకుని నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలు, రాష్ట్ర అభివృద్ధి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సూచించారు. రాజకీయ విమర్శలకు బదులుగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.

# క్రిటికల్ మినరల్స్ రంగంలో పరిశోధనలకు త్రిముఖ భాగస్వామ్యం బలోపేతం

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):



క్రిటికల్ మినరల్స్ పరిశోధన, ఖనిజ అన్వేషణ, అధునాతన సాంకేతిక అభివృద్ధి రంగాల్లో తెలంగాణను ముందంజలో నిలిపేందుకు త్రిముఖ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ మేరకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా క్రిటికల్ మినరల్స్‌కు సంబంధించిన పరిశోధనలు, ఖనిజ వనరుల అన్వేషణ, ఆధునిక వెలికితీత మరియు శుద్ధి సాంకేతికతల అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. భవిష్యత్ పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని పరిశోధనా సంస్థలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు కలిసి పనిచేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు.

తెలంగాణ కేవలం క్రిటికల్ మినరల్స్ వినియోగదారుగా మాత్రమే కాకుండా, పరిశోధన, ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధి, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలోనూ కీలక కేంద్రంగా ఎదగాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఈ రంగంలో రాష్ట్రం ప్రత్యేక గుర్తింపు సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఐఐటీ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను మరింత బలోపేతం చేసి, పరిశ్రమలకు ఉపయోగపడే వాణిజ్య స్థాయి సాంకేతికతలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ దిశగా ప్రభుత్వం పూర్తి స్థాయి సహకారం అందిస్తుందని, పరిశోధనలకు అవసరమైన ప్రోత్సాహం కల్పిస్తుందని హామీ ఇచ్చారు.

పునరుత్పాదక ఇంధన రంగం, విద్యుత్ వాహనాలు, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమలకు క్రిటికల్ మినరల్స్ అత్యంత కీలకమని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ రంగాల్లో భవిష్యత్ అవసరాలను తీర్చేందుకు శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు అవసరమని పేర్కొన్నారు. క్రిటికల్ మినరల్స్ రంగంలో అంతర్జాతీయ స్థాయి భాగస్వామ్యాలు, పరిశోధన ఆధారిత అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి ద్వారా తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి సంస్థల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల ప్రజా పాలనలో ఆర్టీసీకి కొత్త ఊపు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటి వరకు 347.36 కోట్ల మంది మహిళలు ఈ పథకం ద్వారా ఉచితంగా ప్రయాణించి రూ.12,167 కోట్ల మేర ఆర్థిక లాభం పొందినట్లు వెల్లడించారు. మహిళల ఆర్థిక సాధికారతకు ఈ పథకం ఎంతో దోహదపడుతోందని, పలు సర్వేలు కూడా దీనిని నిర్ధారిస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలో తొలిసారిగా 600 బస్సులకు మహిళలను యజమానులుగా చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని మంత్రి తెలిపారు. ప్రతి బస్సుకు నెలకు రూ.69,468 చొప్పున వాయిదా చెల్లిస్తూ మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్నామని చెప్పారు. ఇందుకోసం నెలకు రూ.4 కోట్లకుపైగా చెల్లిస్తున్నామని, ఇప్పటి వరకు రూ.29.31 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. గతంలో 67 శాతంగా ఉన్న బస్సుల వినియోగం ప్రస్తుతం 89 శాతానికి చేరుకోవడం ఆర్టీసీపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్నారు.

ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించేందుకు 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేశామని, అందులో 1,024 విద్యుత్ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ నగరంలో మరో 2,200 విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ఎంఎంటీఎస్, మెట్రో, ఆర్టీసీ సేవల సమన్వయంతో చివరి మైలు వరకు ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. బస్ స్టేషన్ల ఆధునికీకరణ, కొత్త డిపోల ఏర్పాటు, విద్యుత్ వాహన విధానం అమలు, కొత్త మార్గాల ప్రారంభం వంటి చర్యలతో రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రెండు వేతన సవరణలు, ఐదు కరవు భత్యాలు అందించామని, ఎలాంటి పెండింగ్ బకాయిలు లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. 1,424 కారుణ్య నియామకాలు చేపట్టడంతో పాటు, విధుల నుంచి తొలగించబడిన 244 మంది ఉద్యోగులను తిరిగి సేవల్లోకి తీసుకున్నామని వెల్లడించారు. 4,538 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా, ఇప్పటికే వెయ్యి మంది డ్రైవర్లు, 743 మంది శ్రామికుల నియామకాలు పూర్తయ్యాయని, మరో 1,500 మంది కండక్టర్ల నియామకానికి అనుమతి లభించిందన్నారు.

రోడ్డు భద్రత, సాంకేతిక సంస్కరణలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టామని మంత్రి పేర్కొన్నారు. వాహన, సారథి సేవలను ప్రవేశపెట్టడంతో పాటు స్క్రాప్ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఆటోమేటిక్ డ్రైవింగ్ పరీక్షలు, రహదారి భద్రత కార్యక్రమాలు, ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందించే పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. రవాణా శాఖలో ఖాళీల భర్తీ, అమలు విభాగాల బలోపేతం ద్వారా సేవల నాణ్యతను మరింత మెరుగుపరుస్తున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే అగ్రగామి సంస్థగా ఎదుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు కొత్త మార్గాల్లో బస్సులను నడుపుతున్నామని, గ్రామీణ ప్రాంతాలకు కూడా రవాణా సౌకర్యాలు విస్తరిస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులు, అధికారుల సమిష్టి కృషితో ఆర్టీసీ మరింత అభివృద్ధి సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## నాడు ఎస్సైగా.. నేడు సీఐగా.. ధర్మసాగర్ ఎస్‌హెచ్ఓగా శ్రీనివాస్



**ధర్మసాగర్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌కు నూతన సీఐగా శ్రీనివాస్ బదిలీపై వచ్చారు. గతంలో ఇదే పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన ఆయన, తాజాగా సీఐ హోదాలో ధర్మసాగర్ ఎస్‌హెచ్ఓగా బాధ్యతలు చేపట్టడం స్థానికంగా ఆసక్తికరంగా మారింది. ఎస్సైగా పనిచేసిన సమయంలో శ్రీనివాస్ ఒక స్ట్రిక్ట్ పోలీస్ అధికారిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీ లేకుండా వ్యవహరిస్తూ, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠినంగా చర్యలు తీసుకునేవారని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. చిన్నా, పెద్దా, పేదా, ధనికా అనే తారతమ్యం లేకుండా అందరినీ సమానంగా చూడటం ఆయన ప్రత్యేకతగా పేరొందింది. ఆయన ఎస్సైగా విధులు నిర్వహించిన సమయంలో రాత్రి వేళల్లో పోలీసుల తనిఖీలు, పెట్రోలింగ్‌ను కట్టుదిట్టం చేయడంతో ధర్మసాగర్‌లో లా అండ్ ఆర్డర్ పటిష్టంగా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో అనవసరంగా బయట తిరిగే వారిలో సైతం పోలీసులంటే భయం ఉండేలా క్రమశిక్షణతో విధులు నిర్వహించారని గుర్తుచేసుకుంటున్నారు. తన కఠినమైన పోలీసింగ్‌తో పాటు ప్రజల పట్ల సమాన వైఖరి, విధి నిర్వహణలో నిబద్ధతతో శ్రీనివాస్ అప్పట్లో స్థానికుల అభిమానాన్ని సైతం చూరగొన్నారు. ఆయనను అభిమానించే కొందరు ప్రేమగా "శివమణి" అని పిలుచుకునేవారని స్థానికులు చెబుతున్నారు. నాడు ఎస్సైగా ధర్మసాగర్‌లో తనదైన ముద్ర వేసిన శ్రీనివాస్.. నేడు అదే ప్రాంతానికి సీఐగా రావడంతో శాంతిభద్రతల విషయంలో మళ్లీ తనదైన శైలిలో పనిచేస్తారనే ఆశాభావం స్థానికుల్లో వ్యక్తమవుతోంది.



## పెద్ద ఏన గుట్ట ఆక్రమణలను అడ్డుకోవాలి

- **నిర్ణయించి ప్రభుత్వ ఆధీనంలో పరిరక్షించాలి**
- **గొర్రెల కాపరుల మేత భూమిని కాపాడాలి:**
- **సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్**

**స్టేషన్ ఘనపూర్, తెలంగాణ ముచ్చట్లు, సెప్టెంబర్ 1:** మండలంలోని సముద్రాల గ్రామంలో ఉన్న పెద్ద ఏన గుట్ట ఆక్రమణలను వెంటనే అడ్డుకుని, ఆ ప్రాంతానికి స్పష్టమైన హద్దులు నిర్ణయించి ప్రభుత్వ ఆధీనంలో పరిరక్షించాలని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పెద్ద ఏన గుట్టను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.

ఈ సందర్భంగా మునిగెల రమేష్ మాట్లాడుతూ.. సముద్రాల గ్రామంలోని పెద్ద ఏన గుట్టను కొద్ది రోజులుగా కొందరు ప్రైవేటు వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. గుట్టపై ఉన్న చెట్లను తొలగించి, భూమిని చదును చేసి మట్టిని తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎన్నో ఏళ్లుగా స్థానిక గొర్రెల కాపరులు పెద్ద ఏన గుట్టపై గొర్రెలను మేపుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. ఈ గుట్ట వారి జీవనోపాధిలో కీలక పాత్ర పోషిస్తోందని, ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణల కారణంగా మేత భూమిని కోల్పోతే గొర్రెల కాపరుల కుటుంబాల జీవనోపాధి తీవ్రంగా దెబ్బ తింటుందని పేర్కొన్నారు.

ప్రభుత్వం వెంటనే పెద్ద ఏన ప్రాంతంలో సమగ్ర సర్వే నిర్వహించి, గుట్టకు సంబంధించిన హద్దులను స్పష్టంగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. హద్దు రాళ్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిని గుర్తించి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

పెద్ద ఏన గుట్ట కేవలం గొర్రెల మేత భూమి మాత్రమే కాదని, అక్కడి చెట్లు, పక్షులు, చిన్నచిన్న జంతువులు, ఇతర జీవరాశులకు ఆవాసంగా ఉందని మునిగెల రమేష్ తెలిపారు. గుట్టను చదును చేయడం, చెట్లను తొలగించడం, మట్టి తవ్వకాలు చేపట్టడం వల్ల సహజ పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని అన్నారు.

అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేసి కొందరి వ్యక్తిగత ఆర్థిక ప్రయోజనాలను కాపాడటం సరైన విధానం కాదని ఆయన విమర్శించారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, గుట్టలు, మేత భూములు ప్రజల ఉమ్మడి ఆస్తులని, వాటిని భవిష్యత్ తరాల కోసం కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

పెద్ద ఏన ప్రాంతంలో అక్రమంగా చెట్ల నరికివేత, మట్టి తవ్వకాలు, భూఆక్రమణలకు పాల్పడుతున్న వారిని గుర్తించి వెంటనే అడ్డుకోవాలని కోరారు. ఇప్పటికే జరిగిన నష్టాన్ని అధికారులు పరిశీలించి, పర్యావరణ పరిరక్షణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

అవసరమైతే పెద్ద ఏన గుట్టను మేత భూమిగా, ప్రకృతి పరిరక్షణ ప్రాంతంగా అభివృద్ధి చేసి స్థానిక గొర్రెల కాపరులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గొర్రెల కాపరులు, గ్రామ ప్రజల జీవనోపాధికి భంగం కలిగించే ఎలాంటి చర్యలను ప్రభుత్వం అనుమతించకూడదని మునిగెల రమేష్ అన్నారు. ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా జరిగే ఆక్రమణలపై సీపీఎం పార్టీ ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శి కత్తుల రాజు, నాయకులు ఓరుగంటి మల్లయ్య, తాటికొండ నాగరాజు, మేకల కొమురయ్య, తాటికొండ ఉప్పలయ్య, పి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండ.!

- **రూ.5 లక్షల తక్షణ ఆర్థిక సాయం.**
- **ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం.**
- **వ్యవసాయ భూమి కేటాయింపునకు హామీ.**




**అశ్వారావుపేట, సెప్టెంబరు 1(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లోని ప్రైమ్ కేర్ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తున్న ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఊకె శిరీష అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ-శిశు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం చౌటిగూడెం గ్రామానికి చేరుకున్న వారు శిరీష కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రూ.5 లక్షల తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఐటీడీఏ ద్వారా అవసరమైన సహాయం అందిస్తామని, కుటుంబ జీవనోపాధికి కొంతమేర వ్యవసాయ ప్రభుత్వ భూమిని కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శిరీష మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు స్పష్టం చేశారు. శిరీష కుటుంబానికి వ్యక్తిగతంగా, ప్రభుత్వపరంగా, పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. న్యాయం జరిగే వరకు కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

# నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన






- **పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీజీఈజేఏసీ డిమాండ్**

**వనపర్తి,సెప్టెంబర్01( తెలంగాణ ముచ్చట్లు):** ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయాల సముదాయంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. టీజీఈజేఏసీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆరు కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగులకు పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అమలు చేసే బాధ్యత ఉద్యోగులదేనని, అలాంటి ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం మొండి వైఖరిని వీడి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సెక్రటరీ జనరల్ ఎస్. వరప్రసాద్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పట్ల ఉదాసీన వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఉద్యోగుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అడిషనల్ కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సమర్పించారు. కార్యక్రమంలో టీజీఈజేఏసీ నాయకులు జీసీ రాజు, రవిప్రసాద్ గౌడ్, మహేష్, హరిప్రసాద్, నరసింహులు గౌడ్, వెంకటేష్, రామిరెడ్డి, సత్యనారాయణ, రామన్ గౌడ్, జగపతిరావు, గిరీష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉద్యోగులకు టీజీఈజేఏసీ బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## దళితుల భూముల వ్యవహారంపై ఎమ్మెల్యే మేఘారెడ్డిపై బీఆర్ఎస్ ఆరోపణలు





- **రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ జరపాలి.. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఫిర్యాదు**

**వనపర్తి,సెప్టెంబర్01(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి దళితులకు చెందిన లావణ్ణి పట్టా భూములను నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, రెవెన్యూ రికార్డుల్లో పట్టాగా మార్పిడి చేయించుకున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి, నాయకులు ఎం.రాజశేఖర్, దొడ్ల రాములు, జాత్రు నాయక్ మాట్లాడుతూ.. పెద్దమందడి మండలం వెల్టూర్ శివారులోని సర్వే నంబర్ 517/ఏ 2లో 0.39 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని రెవెన్యూ రికార్డుల్లో పట్టా మార్పిడి చేయించుకున్నారని ఆరోపించారు. అదేవిధంగా దోడగుంటపల్లి-అంకూరు మధ్య సోలార్ ప్లాంట్‌కు సంబంధించి ఎస్సీలకు చెందిన 5 ఎకరాల 10 గుంటల లావణ్ణి పట్టా భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంపైనా విచారణ జరపాలని కోరారు. ఈ వ్యవహారంలో సంబంధిత రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారుల పాత్రపైనా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. భూముల వ్యవహారంపై ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు నాయకులు తెలిపారు. ఎన్నికల అఫిడవిట్‌లో భూములకు సంబంధించిన వివరాలను తప్పుగా చూపించారని ఆరోపిస్తూ కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఆరోపణలు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నిరంజన్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని ఎన్నికల సమయంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై ఎమ్మెల్యే మేఘారెడ్డి చేసిన ఆరోపణలను ఇప్పటివరకు నిరూపించలేకపోయారని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. నిరాధార ఆరోపణలు చేసినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేకు సంబంధించిన మరిన్ని ఆరోపణలను ఆధారాలతో ప్రజల ముందుకు తీసుకొస్తామని తెలిపారు. సమావేశంలో చంద్రశేఖర్ నాయక్, ఎద్దుల సాయికుమార్, వసంత్, జూదం వెంకటేష్, పీన్యా నాయక్, నారాయణ నాయక్, కవితా నాయక్‌తో పాటు పలువురు సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సన్న వడ్లకు రూ.500 బోనస్

- **సెప్టెంబరు 10లోగా సాగు వివరాల నమోదు.**



**సత్తుపల్లి, సెప్టెంబరు 1(తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల సన్నవరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వనున్నారు. ఈ మేరకు జీఓ నంబరు 528ను ఆగస్టు 24న జారీ చేసింది. బోనస్ పొందేందుకు సన్న వరి సాగు చేస్తున్న రైతులు తమ పంట వివరాలను సెప్టెంబరు 10లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరామ్, కేఎన్ఎం 1638, డబ్ల్యూజీఎల్ 44, కేఎన్ఎం 7715 రకాలను ప్రభుత్వం సన్నవరి రకాలుగా గుర్తించింది. ఈ విత్తనాలను డీలర్ల వద్ద కొనుగోలు చేసిన రైతులు సంబంధిత డీలర్ వద్ద తమ సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి. సొంత విత్తనాలతో సాగు చేస్తున్న రైతులు ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో స్వీయ ధ్రువీకరణ చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ నమోదు ద్వారా రైతుల వివరాల నమోదు, క్షేత్రస్థాయి పరిశీలన, క్రాప్ బుకింగ్ ప్రక్రియ పూర్తవుతుంది. అనంతరం ధాన్యం కొనుగోలు సమయంలో ఆయా రైతులకు ప్రాధాన్యం లభించడంతోపాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందుతుంది. సన్నవరి సాగును ప్రోత్సహించడం, రైతులకు అదనపు ఆర్థిక ప్రయోజనం కల్పించడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన సన్న బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.

గడువు లోపే నమోదు

అర్హత కలిగిన రైతులు గడువు ముగిసే వరకు వేచి చూడకుండా సెప్టెంబరు 10లోగా తమ సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కొత్తగూడెం విమానాశ్రయానికి కదలిక





- ఈ నెల 7న కేంద్ర అధికారుల బృందం పర్యటన.
- రామ్మోహన్ నాయుడును కోరిన మంత్రి తుమ్మల.

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబరు 1(తెలంగాణ ముచ్చట్లు):** కొత్తగూడెం వద్ద గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును కోరారు. మంగళవారం ఢిల్లీలో ఆయనను కలిసి విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదనను వివరించారు. కొత్తగూడెం వద్ద విమానాశ్రయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన స్థలంపై కేంద్ర పౌర విమానయాన శాఖ ఫీజిబిలిటీ సర్వే నిర్వహించిందని తుమ్మల తెలిపారు. ఆ స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనువుగా లేదని సర్వేలో తేలడంతో ప్రత్యామ్నాయ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. కొత్తగా ప్రతిపాదించిన స్థలంపై కూడా ఫీజిబిలిటీ సర్వే పూర్తయిందని వివరించారు. ఈ నేపథ్యంలో విమానాశ్రయం నిర్మాణానికి కేంద్రం నుంచి చొరవ చూపాలని కోరారు. తుమ్మల విజ్ఞప్తిపై స్పందించిన రామ్మోహన్ నాయుడు.. ఈ నెల 7న కేంద్ర అధికారుల ప్రతినిధి బృందాన్ని కొత్తగూడెంకు పంపిస్తామని హామీ ఇచ్చారు.

భద్రాచలం భక్తులకు ప్రయోజనం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం రామాలయం దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిందని తుమ్మల పేర్కొన్నారు. దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి వస్తుంటారని తెలిపారు. కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటైతే భద్రాచలం వచ్చే భక్తులకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుందని చెప్పారు.
పారిశ్రామిక, పర్యాటక రంగాలకు ఊతం

సింగరేణి గనులు, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ, బీపీఎల్ వంటి సంస్థలతో జిల్లా పారిశ్రామికంగా ప్రాధాన్యం సంతరించుకుందని తుమ్మల తెలిపారు. అటవీ ప్రాంతాలు, అరుదైన ఖనిజ నిక్షేపాలతో ఎకో టూరిజానికి జిల్లాలో మంచి అవకాశాలున్నాయని చెప్పారు. దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని కొత్తగూడెంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విమానాశ్రయం నిర్మాణం పూర్తయితే పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాల్లో జిల్లా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని తుమ్మల అన్నారు. నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. రామ్మోహన్ నాయుడు చొరవతో కొత్తగూడెం విమానాశ్రయం కల సాకారమవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి



- ఎంఈఓ విడపు శ్రీనివాస్

**హుజురాబాద్, సెప్టెంబర్ 1(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్యను అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటు సంతోషకరమని మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చెల్పూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించిన ఎంఈఓ విద్యార్థుల విద్యా ప్రగతిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో పదాలను చదివించి, వారి చదవగలిగే సామర్థ్యాన్ని స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిపై ఉపాధ్యాయులతో చర్చించారు.
ఈ సందర్భంగా నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం, సంఖ్యా పరిజ్ఞానం వంటి ప్రాథమిక నైపుణ్యాలను చిన్నతనం నుంచే బలోపేతం చేయాలని సూచించారు. పునాది అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసి ప్రతి విద్యార్థి విద్యా సామర్థ్యాన్ని మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. రమాదేవి, ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రాజు, ఆశ్రిత, సీఆర్పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహపూర్వక పోలీసింగ్‌కు చిరునామా.. సీఐ పులి రమేష్



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన సీఐ పులి రమేష్ బదిలీపై వెళ్తుండటంతో మండలంలోని అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. సీఐ పులి రమేష్ విధుల నిర్వహణలో ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేవారని నాయకులు పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరితో కలిసిమెలిసి ఉంటూ ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేశారని తెలిపారు. ఎల్కతుర్తి మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారని అన్నారు. ప్రజల్లో భద్రతా భావాన్ని కల్పించడంతో పాటు పోలీస్ శాఖపై నమ్మకాన్ని పెంచడంలో ఆయన పాత్ర అభినందనీయమన్నారు. ప్రజలకు చేరువగా ఉంటూ స్నేహపూర్వక పోలీసింగ్‌ను కొనసాగించిన సీఐ పులి రమేష్ ఎల్కతుర్తి ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని నాయకులు పేర్కొన్నారు. ఆయన బదిలీ బాధ కలిగిస్తున్నప్పటికీ, భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎల్కతుర్తిలో సీఐ పులి రమేష్ అందించిన సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని, ఆయన భవిష్యత్ సేవా ప్రయాణం విజయవంతంగా సాగాలని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## 'ముద్ర యోజన' పేరుతో మాయమాటలు.. రూ.6 లక్షలు కొల్లగొట్టిన కేటుగాళ్లు



**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రధానమంత్రి ముద్ర యోజన పేరుతో ఫోన్ చేసి లోన్ ఇప్పిస్తామని నమ్మించిన సైబర్ మోసగాళ్లు ఓ వ్యక్తి నుంచి ఏకంగా రూ.6 లక్షలు కొల్లగొట్టారు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు ముల్కనూర్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదైంది.హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనార్సింగాపూర్ గ్రామానికి చెందిన వడ్డేపల్లి జనార్ధన్‌కు ఆగస్టు 15న ఉదయం గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తాము ప్రధానమంత్రి ముద్ర యోజన నుంచి మాట్లాడుతున్నామని, రుణం మంజూరు చేస్తామని చెప్పాడు. రుణ ప్రక్రియకు సర్వీస్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని నమ్మబలికాడు. అతడి మాటలు నమ్మిన జనార్ధన్ దఫదఫాలుగా ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా వారు సూచించిన నంబర్లకు సుమారు రూ.6 లక్షలు బదిలీ చేశాడు.అయితే డబ్బులు చెల్లించినా రుణం మంజూరు కాలేదు. పైగా మరికొంత నగదు పంపితే రుణంతో పాటు ముందుగా చెల్లించిన డబ్బు కూడా తిరిగి వస్తుందని మోసగాళ్లు మరోసారి ఫోన్ చేశారు. దీంతో అనుమానం వచ్చిన జనార్ధన్ తాను సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించి ముల్కనూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తెలియని వ్యక్తుల ఫోన్‌కాల్స్‌ను నమ్మి రుణాల పేరుతో నగదు బదిలీ చేయవద్దని, బ్యాంకు లేదా ప్రభుత్వ పథకాల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.





# హామీలు కాదు.. రోడ్డు పనులు వెంటనే చేపట్టాలి: సర్పంచ్ కుమారస్వామి



**భీమదేవరపల్లి,సెప్టెంబర్01(తెలంగాణ ముచ్చట్లు):** భూమి పూజ చేసి రెండేళ్లు గడిచినా రోడ్డు పనులు ప్రారంభం కాకపోవడంపై భీమదేవరపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. మహిళలు రోడ్డుపై నాట్లు వేస్తూ నిరసన తెలిపారు.
భీమదేవరపల్లి గ్రామపంచాయతీ నుంచి వంగర రోడ్డు వరకు నిర్మించాల్సిన రహదారికి రెండు సంవత్సరాల క్రితం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భూమి పూజ చేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడం అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని సర్పంచ్ కుమారస్వామి ఆరోపించారు. రోడ్డు పనులు ప్రారంభించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. మంత్రి అధికారులకు, కాంట్రాక్టర్లకు ఫోన్ చేసి పనులు ప్రారంభించాలని సూచించినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదన్నారు. మండల కేంద్రంలోని ఈ ప్రధాన రహదారిపై మండల అధికారులు, ఐదు మండలాల ప్రజలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రాకపోకలు సాగిస్తుంటారని, ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన రహదారి పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శనిగరం ఐలయ్య, వార్డు సభ్యులు పోలు సదానందం, పోలు అశోక్, బొల్లంపల్లి శ్యామ్, సాతురి విజయ, మార్పాటి లలితతో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# హుజురాబాద్ మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- మంత్రి శ్రీధర్ బాబుకు ప్రణవ్ బాబు, సుహాసిని మనోజ్ రావు వినతి



**హుజురాబాద్,సెప్టెంబర్ 01(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు మంత్రి శ్రీధర్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిసి పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.
హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని వారు మంత్రికి వివరించారు. ముఖ్యంగా పట్టణంలోని రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, పారిశుధ్య నిర్వహణ, ప్రజలకు అవసరమైన ఇతర మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరారు.
పట్టణంలో పెరుగుతున్న జనాభా, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రత్యేక నిధులు ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. ఇప్పటికే చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు నిధుల కొరత కారణంగా పూర్తిస్థాయిలో ముందుకు సాగడం లేదని, ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి అవసరమైన నిధులను మంజూరు చేస్తే హుజురాబాద్ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. హుజురాబాద్ పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని మంత్రి శ్రీధర్ బాబును ప్రణవ్ బాబు, సుహాసిని మనోజ్ రావు విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను వినతిపత్రంలో పొందుపరిచి మంత్రికి అందజేశారు. హుజురాబాద్ అభివృద్ధిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అవసరమైన నిధులు మంజూరు చేస్తుందనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొని హుజురాబాద్ మున్సిపాలిటీకి సంబంధించిన అభివృద్ధి అవసరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## కేక్ కాదు.. పర్యావరణ ప్రతిజ్ఞే అసలైన వేడుకలు

- **వినూత్నంగా కోల రవీందర్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** జన్మదిన వేడుకలను వినూత్నంగా, సందేశాత్మకంగా నిర్వహిస్తూ సామాజిక, పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ ఆదర్శంగా నిలిచారు. సాధారణంగా కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకునే సంప్రదాయానికి భిన్నంగా.. కేక్‌కు బదులుగా సహజంగా పండిన పుచ్చకాయను కట్ చేసి వేడుకలను ప్రారంభించారు.

అనంతరం మహిళలకు చేతి సంచులను అందజేసి, ప్లాస్టిక్ కవర్ల వినియోగానికి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఇకపై మార్కెట్‌కు వెళ్లిన ప్రతిసారీ చేతి సంచులనే ఉపయోగిస్తామని, ప్లాస్టిక్ కవర్లకు పూర్తిగా గుడ్‌బై చెబుతామని మహిళలు ప్రతిజ్ఞ చేయడంతో కార్యక్రమం పర్యావరణ చైతన్యానికి వేదికగా మారింది.

ఈ సందర్భంగా కోల రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. "ప్లాస్టిక్‌ను వదిలేస్తే రైతు బతుకుతాడు.. పర్యావరణం నిలుస్తుంది.. మన ఆరోగ్యం కాపాడబడుతుంది" అని అన్నారు. తాను ఎల్లప్పుడూ తన వాహనంలో రెండు చేతి సంచులు, ఒక ప్లేట్, ఒక గ్లాస్ ఉంచుకుంటానని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి చిన్న చిన్న అలవాట్లను జీవితంలో భాగం చేసుకుంటే పర్యావరణ పరిరక్షణలో పెద్ద మార్పు తీసుకురావచ్చని అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో డ్రైనేజీల్లో భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి కాలనీలు ముంపునకు గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాలు, యువత కలిసి ప్రతి బస్తీ, ప్రతి వారాంతపు మార్కెట్‌లో ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమాన్ని చేపట్టాలని కోల రవీందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. "పర్యావరణాన్ని కాపాడటం అంటే భావితరాల భవిష్యత్తును కాపాడటమే" అని ఆయన అన్నారు. జన్మదిన వేడుకలను పర్యావరణ చైతన్య కార్యక్రమంగా మలచిన కోల రవీందర్ ముదిరాజ్‌ను కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అభినందించారు.

## గోకులాన్ని తలపించిన హిమ్మత్‌నగర్ పాఠశాల




- **శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారుల సందడి**

**వీణవంక, సెప్టెంబర్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా వీణవంక మండలం హిమ్మత్‌నగర్ ఎంపీయూపీఎస్ పాఠశాల కృష్ణాష్టమి వేడుకలతో మంగళవారం గోకులాన్ని తలపించింది. పాఠశాల ఆవరణలో ముందస్తుగా నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలు విద్యార్థుల సందడి, సాంస్కృతిక కార్యక్రమాలతో కన్నుల పండువగా సాగాయి. గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ కొబ్బరికాయ కొట్టి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులు కృష్ణుడి వేషధారణలో మురళీధరుడిని తలపిస్తూ చేసిన సందడి పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. చిన్నారులు ఉత్సాహంతో పాల్గొనగా, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు కేరింతలతో వారిని ప్రోత్సహించారు. సంప్రదాయ పండుగను విద్యార్థులకు పరిచయం చేస్తూ, వారిలో సాంస్కృతిక విలువలు, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోనె సత్యం, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొనగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



- **వెల్టూర్ లో ఘనంగా చిన్నారి జన్మదిన వేడుకలు**

**పెద్దమందడి,సెప్టెంబర్01(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని వెల్టూర్ గ్రామానికి చెందిన ఏర్పుల ఆంజనేయులు -రజిత దంపతుల కుమార్తె చిన్నారి విఘ్నేశ్వరీ జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కాంగ్రెస్ నాయకులు హాజరై చిన్నారి విఘ్నేశ్వరీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చిన్నారిని ఆప్యాయంగా ఆశీర్వదించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చిన్నారి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కాంగ్రెస్ నాయకులు ఆకాంక్షించారు.జన్మదిన వేడుకల సందర్భంగా కుటుంబ సభ్యులు కేక్ కట్ చేసి చిన్నారి విఘ్నేశ్వరీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డిఎస్ మహేష్, దయ్యాల దాసు, వార్డు సభ్యులు నాగభూషణ్, మద్దూర్ వెంకటయ్య, అశోక్, బండి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై గ్రామసభ

- **చికారు చెట్టు తండాలో ప్రజల అభ్యంతరాలు, సూచనల స్వీకరణ**



**పెద్దమందడిసెప్టెంబర్01(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని చికారు చెట్టు తండా గ్రామపంచాయతీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై విచారణ గ్రామసభను మంగళవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అంగోత్ లలిత కిషన్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలో ఓటర్ల జాబితాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.గ్రామసభలో ఓటర్ల జాబితాను పరిశీలించి అర్హులైన ఓటర్ల వివరాలను పరిశీలించారు. జాబితాలో పేర్లు, వివరాలకు సంబంధించి గ్రామస్తుల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సూచనలను అధికారులు స్వీకరించారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే వాటిని సరిచేయించుకునే విధానం, అర్హులైన వారు తమ పేర్లను నమోదు చేసుకునే అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ప్రతి ఓటరు తమ వివరాలను ఒకసారి పరిశీలించుకుని, ఏవైనా తప్పులు లేదా మార్పులు ఉన్నట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధికారి నాగరాజు, పర్యవేక్షకుడు రాజు, ఓటరు నమోదు అధికారి చిట్టెమ్మ, గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రీతి సుధన్, ఉపసర్పంచ్ గుజ్జమ్మతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామసభకు హాజరై సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులకు సర్పంచ్ అంగోత్ లలిత కిషన్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

# పూసల కులస్తులకు న్యాయం చేయాలి

- **ఫెడరేషన్‌కు చైర్మన్ నియమించాలి**
- **రూ.3 నుంచి 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి**



**మేడ్చల్ జిల్లా, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**పూసల కులస్తుల సమస్యలను పరిష్కరించి, వారి జీవనోపాధికి ప్రభుత్వం తగిన సహాయం అందించాలని కోరుతూ మేడ్చల్ జిల్లా పూసల చైతన్య వేదిక ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. చైతన్య వేదిక అధ్యక్షులు పగిడిపల్లి ఎల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మధ్యబోయిన రాజు, సంయుక్త కార్యదర్శి చేని సురేష్ ఆధ్వర్యంలో ఈ వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే వినతిపత్రాన్ని బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఝాన్సీ రాణికి అందజేశారు.

ఈ సందర్భంగా పూసల చైతన్య వేదిక అధ్యక్షులు పగిడిపల్లి ఎల్లేష్ మాట్లాడుతూ.. పూసల కులం డి ఎన్ టీ (డి నోటిఫెడ్ ట్రైబ్స్ ) విముక్త సంచార జాతుల కేటగిరీలో, బీసీఏ గ్రూపులో ఉందని తెలిపారు. అయితే తమ కులం ఎదుర్కొంటున్న సమస్యలు, తమకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పెద్దలకు సరైన అవగాహన లేకపోవడం బాధాకరమన్నారు.

ఫెడరేషన్‌కు చైర్మన్ నియమించాలి

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణ బలిజ (పూసల) ఫెడరేషన్ ఏర్పాటు చేసినప్పటికీ, ఫెడరేషన్ ఏర్పడి 15 సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు చైర్మన్ నియామకం జరగలేదని ఎల్లేష్ పేర్కొన్నారు. తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే నాయకత్వం లేకపోవడంతో పూసల కులస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

కేటాయించిన నిధులు పూర్తిగా విడుదల చేయాలి

ఫెడరేషన్‌కు ఇప్పటివరకు రూ.126కోట్లు కేటాయించగా, ప్రభుత్వం రూ.17.44కోట్లు మాత్రమే విడుదల చేసిందని తెలిపారు. అందులో కేవలం 56 స్వయం సహాయక సంఘాలకు చెందిన 1,092 మందికి రూ.5.34 కోట్లు మాత్రమే అందాయని పేర్కొన్నారు. బీసీ కులానికి చెందినప్పటికీ పూసల కులస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సంప్రదాయ వృత్తికి ప్రభుత్వ సహకారం కావాలి

కార్పొరేట్ వ్యవస్థ పెరగడంతో గల్లీ గల్లీలో గాజుల దుకాణాలు ఏర్పడుతున్నాయని, దీంతో తరతరాలుగా పూసలు, గాజుల వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్న పూసల కులస్తుల జీవనోపాధి దెబ్బతింటోందని తెలిపారు.

ప్రధాన డిమాండ్లు

పూసల కులస్తులు గాజుల దుకాణాలు, పూసల వ్యాపారం ప్రారంభించుకునేందుకు ఎలాంటి ష్యూరిటీ లేదా గ్యారెంటీ లేకుండా రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు.

అలాగే కృష్ణ బలిజ (పూసల) ఫెడరేషన్‌కు వెంటనే చైర్మన్‌ను నియమించేలా ముఖ్యమంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి ప్రతిపాదనలు పంపాలని జిల్లా అధికారులను కోరారు.

పూసల కులస్తుల జీవనోపాధి, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని న్యాయం చేయాలని పూసల చైతన్య వేదిక నాయకులు విజ్ఞప్తి చేశారు.

# 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

- **6 గ్యారంటీలు.. 420 హామీల అమలుకు 8 రోజుల ఆందోళనలు**
- **మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి**



**వనపర్తి,సెప్టెంబరు01(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. 6 గ్యారంటీలు, 420 హామీలు, 11 డిక్లరేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 8 రోజుల పాటు వినూత్న నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ శ్రేణులకు ఆందోళన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ ఫలాలను పొందారని, మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమాన్ని విస్మరించి విధ్వంస పాలన సాగిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రైతు భరోసా, రుణమాఫీ, పంటలకు బోనస్, రైతు కూలీలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా, ఆటో కార్మికులకు ఆర్థిక సాయం, మహిళలకు ఆర్థిక సహాయం, వృద్ధులు, బీడీ కార్మికులు, దివ్యాంగులకు ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి-షాదీముబారక్‌కు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. ప్రజలకు రావాల్సిన బకాయిలను చెల్లించే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఓటరు జాబితా సవరణలో బీఆర్ఎస్ బీఎల్ఏలు, నాయకులు క్రియాశీలకంగా పనిచేసినందుకు నిరంజన్‌రెడ్డి అభినందించారు. ఓటరు జాబితా సవరణ పూర్తయిందని నిర్లక్ష్యం చేయకుండా, ఓటర్లకు వస్తున్న నోటీసులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నోటీసుల పరిష్కారానికి ప్రజలకు అందుబాటులో ఉండాలని పార్టీ నాయకులను ఆదేశించారు.సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్‌గౌడ్, మాజీ చైర్మన్ బి.లక్ష్మయ్య, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ కర్రెస్వామి, కౌన్సిలర్ మురళీసాగర్, మండల పార్టీ అధ్యక్షులు కె.మాణిక్యం, గంధం పరంజ్యోతి, రాళ్ల కృష్ణయ్య, వనం రాములు, దిలీప్‌రెడ్డి, అల్వాల వెంకట్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, సర్పంచులు శోభా, తిరుపతయ్య, శేఖర్, నాగమ్మ, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.






# జాతీయ గుర్తింపు దిశగా కొత్తపల్లి పల్లె దవాఖాన

- **జాతీయ నాణ్యత ప్రమాణాల పరిశీలన..**
- **వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సేవలపై సమీక్ష**

**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం (పల్లె దవాఖాన) జాతీయ స్థాయి గుర్తింపు సర్టిఫికెట్ సాధించే దిశగా ముందడుగు వేసింది. జాతీయ నాణ్యత సేవల అంచనా బృందం మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆరోగ్య మందిరంలోని నాణ్యత ప్రమాణాలను పరిశీలించింది. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు, మౌలిక వసతులు, రోగులకు అందిస్తున్న మందులు, వివిధ ఆరోగ్య సేవల నిర్వహణ తదితర అంశాలను బృందం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పర్యవేక్షించింది. నాణ్యత ప్రమాణాల పరిశీలన అనంతరం జాతీయ స్థాయి గుర్తింపు సర్టిఫికెట్ లభించే అవకాశం ఉందని హుజూరాబాద్ డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ ప్రభుదాస్ తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలకు జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావడానికి వైద్య, ఆరోగ్య శాఖ తరపున కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన నాణ్యత ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య వ్యవస్థల వనరుల కేంద్రం అంచనా బృందం సభ్యులు డాక్టర్ దినేష్‌కుమార్, డాక్టర్ జార్జ్ ఇమ్మానియేల్, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ పోల్నేని అజయ్ రావు, వైద్యాధికారులు డాక్టర్ చందన, డాక్టర్ మహోన్నత పటేల్, సీహెచ్‌ఓ దిలీప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, డీపీఓ స్వామి, జిల్లా ఆరోగ్య విద్యాధికారి పంజాల ప్రతాప్ గౌడ్, నాణ్యత ప్రాజెక్టు మేనేజర్ అనిల్ కుమార్, సూపర్వైజర్ కొండపాక సదానందం, నాణ్యత సహాయకుడు అఖిల్, ఏఎన్ఎంలు వాణి, మంజుల, శ్రీముఖ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ప్రశ్నిస్తే అరెస్టులా? కాంగ్రెస్‌ది పిరికిపందల రాజకీయం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి అరెస్టు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే చర్య
- బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేష్ ఠాకూర్




**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే విధంగా వ్యవహరిస్తోందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేష్ ఠాకూర్ ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

తెలంగాణ బీజేపీ భవన్ ఎదుట కాంగ్రెస్ నాయకులు వ్యవహరించిన తీరు, అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలను కాలరాసే చర్యలని రాజేష్‌ఠాకూర్ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, తమ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై నిర్బంధాలు, అరెస్టులతో అణచివేతకు పాల్పడుతోందని విమర్శించారు.

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ఉన్న హక్కులను కాలరాయడం, బీజేపీ నాయకులను అడ్డుకోవడం, అరెస్టులు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమని అన్నారు. నల్లగొండలో బీజేపీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన ఘటనలపై న్యాయం కోసం పోరాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడిని అడ్డుకుని అరెస్టు చేయడం ప్రభుత్వ నిరంకుశ ధోరణికి పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రామచందర్ రావును అరెస్టు చేయడం ద్వారా బీజేపీ గొంతును నొక్కగలమని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తే అది కేవలం భ్రమేనని రాజేష్ ఠాకూర్ స్పష్టం చేశారు. ఒక నాయకుడిని అరెస్టు చేస్తే వందలాది మంది కార్యకర్తలు మరింత ఉత్సాహంతో ముందుకు వస్తారని, బీజేపీ కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సాధ్యం కాదని అన్నారు.

కాంగ్రెస్ బెదిరింపులకు, అక్రమ అరెస్టులకు బీజేపీ భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన ఆయన.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను ప్రజల ముందుకు తీసుకెళ్లి ప్రతి సమస్యపై ప్రజల తరపున పోరాటం చేస్తామని వెల్లడించారు.

"నాయకులను అరెస్టు చేసి ఉద్యమాలను ఆపలేరు.. అక్రమ కేసులతో కార్యకర్తలను భయపెట్టలేరు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే వరకు, ప్రజల సమస్యలకు పరిష్కారం లభించే వరకు బీజేపీ పోరాటం ఆగదు" అని రాజేష్‌ఠాకూర్ హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రజలే తగిన సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు.

# 1000 రోజుల పాలన పేదల అభివృద్ధి కోసమే

- డాక్టర్ పిడమర్తి రవి




**హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1000 రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా హిమాయత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ పిడమర్తి రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో వెయ్యి రోజులు పేదల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిన కాలంగా నిలిచాయని అన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.

హైదరాబాద్‌లో పేదలు, సామాన్యులు ఎన్నో ఏళ్లుగా అనుభవిస్తున్న భూముల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని, కార్పొరేట్ శక్తుల కబ్జాల నుంచి పేదల భూములను రక్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న చర్యలు అభినందనీయమని అన్నారు.

గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై ప్రజల్లో సానుకూల స్పందన ఉందని, ఆయనపై ప్రజలకు ప్రగాఢ నమ్మకం ఏర్పడిందని పిడమర్తి రవి పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గం ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజలు తమ సమస్యలు, విజ్ఞప్తులను నేరుగా ప్రభుత్వానికి తెలియజేసుకునేందుకు ముఖ్యమంత్రి అందుబాటులో ఉంటూ సమయం కేటాయించడం ప్రజా పాలనకు నిదర్శనమని అన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు బట్టు శ్రీహరి నాయక్, శ్రీధర్ గౌడ్, సతీష్ కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ బొమ్మెర స్టాలిన్, బోరెల్లి సురేష్, దేవరకొండ నరేష్ చందర్ నాయక్, నక్క మహేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.





# పోషకాహారంపై కలం కదిపిన బాలికలు

- జమ్మికుంట బాలికల పాఠశాలలో వ్యాసరచన పోటీలు
- ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులకు బహుమతులు అందజేత

**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ పోషకాహార వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థుల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించేందుకు హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం జమ్మికుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల విభాగంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ఎనిమిది, తొమ్మిది, పదో తరగతుల విద్యార్థులకు 'సమతుల ఆహారం - ఆరోగ్యకర జీవితం' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన మొదటి ఐదుగురు విద్యార్థులకు ట్రస్ట్ నిర్వాహకులు, సామాజిక కార్యకర్త డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవరకొండ సతీష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. బహుమతులుగా శంకర్ నారాయణ నిఘంటువులను అందించారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవరకొండ సతీష్ మాట్లాడుతూ.. మన ఆరోగ్యానికి అసలైన బలం మనం తీసుకునే పోషకాహారమేనని అన్నారు. కడుపు నిండడమే కాకుండా శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు అందేలా ఆహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. పిల్లల ఎదుగుదలకు, పెద్దల ఆరోగ్య పరిరక్షణకు పోషకాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రుచికి ప్రాధాన్యం ఇవ్వడం కంటే శరీరానికి అవసరమైన పోషకాలు, రోగనిరోధక శక్తిని పెంపొందించే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయ బృందం సమతుల ఆహారం, పోషకాల ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన డి. హర్షిత, సి.హెచ్. ఆశ్రిత, పి. సహస్ర, ఎన్. లిఖిత, ఎం. మోక్షాజ్ఞలను ఉపాధ్యాయ బృందం అభినందించింది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణాష్టమి వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం






**యూసుఫ్‌గూడ,సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరి చౌరస్తాలో ఈ నెల 4న శుక్రవారం రాత్రి నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించినట్లు యూసుఫ్‌గూడ మాజీ కార్పొరేటర్లు గుర్రం మురళి గౌడ్, గుర్రం సంజయ్ గౌడ్ తెలిపారు.మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లను కలిసి వేడుకల ఆహ్వాన పత్రికలను అందజేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ శ్రీకృష్ణాష్టమి వేడుకలకు స్థానిక జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్లు గుర్రం మురళి గౌడ్, సంజయ్ గౌడ్ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా వెంకటగిరి చౌరస్తాలో శ్రీకృష్ణాష్టమి పండుగను, సంప్రదాయ ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రతి ఏటా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో నిర్వహించిన వేడుకలకు మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తదితర ప్రముఖులు హాజరైన విషయాన్ని గుర్తుచేశారు.ఈ ఏడాది వేడుకలు రజతోత్సవ సంబరాల దిశగా సాగుతున్న నేపథ్యంలో గతంలో కంటే మరింత అట్టహాసంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు వెల్లడించారు. ఉట్టి ఉత్సవాన్ని తిలకించేందుకు నియోజకవర్గ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ కార్పొరేటర్లు గుర్రం మురళి గౌడ్, సంజయ్ గౌడ్ కోరారు.

# ఇప్పపువ్వు సారా తయారీ చట్ట బద్ధతకు కృషి చేస్తా

- రేషన్ కార్డుల పంపిణీలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి





**మహబూబ్ నగర్ (మిడ్జిల్) సెప్టెంబర్ 1, (తెలంగాణ ముచ్చట్లు) :** ఇప్పపువ్వు సారా తయారీ చట్ట బద్ధతకు కృషి చేస్తామనని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. నూతన రేషన్ కార్డుల పంపిణీలో బాగంగా మంగళవారం ఆయన జడ్చర్ల నియోజకవర్గం మిడ్జిల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో, తండాల్లో పర్యటించారు.

ఈదులబాయి తాండలో రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల జీవనోపాధికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

ఈదులబాయి తండా ప్రజలు ఇప్పపువ్వు ఆధారిత సారా తయారీని జీవనోపాధిగా కొనసాగిస్తున్న అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. గిరిజనుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా, వారికి చట్టబద్ధంగా న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఇప్పపువ్వు సారకు సంబంధించి త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక రూపొందించేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని , జడ్చర్ల నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పొందడంలో మరింత సౌలభ్యం కలుగుతుందని తెలిపారు.

తండా రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని, ఇప్పటికే మిగిలిపోయిన తండా రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయించి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తండా అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# 5న జష్న్ఏమీలాద్ ఉన్ నబీ

**మహబూబ్ నగర్,సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు) :** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మీరాన్‌పూర్‌లోని ఖాన్కాహ్ కలీమి మీరాన్‌పూర్‌లో ఈ నెల 5వ తేదీ శనివారం 22వ రబీఉల్ అవ్వల్ సందర్భంగా వార్షిక జష్న్ఏమీలాద్ ఉన్ నబీ జియారత్ఏఆసార్ఏముబారక్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ పవిత్ర కార్యక్రమం పిర్ఓముర్షిద్ దర్వీషుల్లా మహమ్మద్ షఫీక్ అలీ ఖాద్రీ చిష్తీ కలీమి మీరాన్‌పూరీ మదజిల్లహుల్ ఆలీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందన్నారు. మధ్యాహ్నం నమాజ్ అనంతరం ప్రత్యేకంగా ఖసీదా బుర్దా షరీఫ్ పఠనం నిర్వహించడంతో పాటు భక్తులకు తఆమ్ఏతామ్ (అన్నదానం) ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పవిత్ర ఆసార్ఏ ముబారక్ జియారత్కు అవకాశం కల్పించనున్నట్టుతెలిపారు.

ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో మహమ్మద్ మీరాజ్ అలీ ఖాద్రీ, మహమ్మద్ అహ్మద్ అలీ ఖాద్రీ, మహమ్మద్ అమ్జద్ అలీ ఖాద్రీ చిష్తీ కలీమి తదితరులు పాల్గొననున్నట్టు పేర్కొన్నారు.ముస్లిం సోదరులు, భక్తులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.





# మహిళలు, బాలికల భద్రతకు ప్రత్యేక నిఘా

- జిల్లా ఎస్పీ డి.జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్1(తెలంగాణ ముచ్చట్లు):** మహిళలు, బాలికలు, విద్యార్థినుల భద్రతకు షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తున్నాయని జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. ఆగస్టులో 20 ఫిర్యాదులు అందగా, 18 మందికి కౌన్సెలింగ్, 17 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకుని, 3 ఈపెట్టీ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

35 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, 70హాట్‌స్పాట్ ప్రాంతాల్లో నిఘా కొనసాగించినట్లు తెలిపారు.ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, పోక్సో, సైబర్ నేరాలు, బాల్యవివాహాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వేధింపులు ఎదురైతే షీ టీమ్ నంబర్ 8712659365 , డయల్100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మానవ అక్రమ రవాణాపై నిఘా

మానవ అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలు, అక్రమ దత్తతపై ఎ హెచ్ టి యు బృందం ఆగస్టులో 18 అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. మైనర్లను పనిలో పెట్టుకోవడం, పిల్లలను విక్రయించడం లేదా అక్రమ దత్తతకు మధ్యవర్తిత్వం చేయడం నేరమని పోలీసులు హెచ్చరించారు. సమాచారం కోసం ఎ హెచ్ టి యు 8712680066, చైల్డ్‌లైన్ 1098కు సంప్రదించాలని సూచించారు.



# అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆర్థిక సాయం

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**



రాజపూర్ మండలం తిరుమలాపూర్ గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన భీమయ్య కుటుంబాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని బాధిత కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు.

అదేవిధంగా ప్రమాదవశాత్తు కాలు విరిగి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న దోనూరు ఆంజనేయులును కూడా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఆయనకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని, బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బంగారి సంతోష వెంకటేష్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ సుశీల రమేష్ నాయక్, మాజీ సర్పంచ్ మహేశ్వరి మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీశైలం యాదవ్, ఆనంద్ గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

- **భోజన విరామ సమయంలో టిజిఇజెఎసి నిరసన**

**జడ్చర్ల, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను వెంటనే రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టిజిఇజెఎసి ఆధ్వర్యంలో మంగళవారం జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ విధానం వల్ల పదవీ విరమణ అనంతరం ఉద్యోగులు, వారి కుటుంబాల ఆర్థిక భద్రతపై ఆందోళన నెలకొంటోందన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ సేవలందించిన ఉద్యోగులకు గౌరవప్రదమైన పెన్షన్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్య పోరాటంతోనే న్యాయమైన డిమాండ్లను సాధించగలమని నాయకులు తెలిపారు. ప్రభుత్వం సమస్యలను సానుకూలంగా పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కోరారు.

నిరసనలో టీఎన్జీవో అధ్యక్షుడు తిరుపతయ్య, పంచాయతీరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, టిజిఇజెఎసి జిల్లా కోకన్వీనర్ తాహెర్, వెంకట్‌రాములు, ముజఫర్, పవన్, నర్సింహులు, సత్యమ్మ, స్వరూప, అంజమ్మ, నూర్జహాన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రజా పోరాటానికి బీఆర్ఎస్ శ్రీకారం..

- **ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో ముఖ్యనేతల సమావేశం**

**కరీంనగర్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కష్టాలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శిబిర కార్యాలయంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాబోయే వారం రోజుల పాటు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఇచ్చిన హామీల అమలు తీరు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని నిర్ణయించారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటాలు నిర్వహించాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ప్రజలను కలిసి ప్రభుత్వ వైఫల్యాలను వివరించేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో కరీంనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి కొండూరు రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, గ్రామీణ మండల అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, కొత్తపల్లి మండల అధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్ గౌడ్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్ విషప్రచారాన్ని తిప్పికొట్టాలి

- **ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు,)**

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై పనిగట్టుకుని విషప్రచారం చేస్తున్నాయని, ఆ రెండు పార్టీల దుష్ప్రచారాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు ఐక్యంగా తిప్పికొట్టాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. తెలంగాణ గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదని ఆయన విమర్శించారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగం కల్పించిన హక్కులకు రక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

చిల్పూర్ మండల కేంద్రంలోని వరలక్ష్మి గార్డెన్స్‌లో నిర్వహించిన చిల్పూర్ మండల, గ్రామ, అనుబంధ కమిటీల పరిచయ కార్యక్రమం, మండల విస్తృతస్థాయి సమావేశానికి కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో 75 ఏళ్ల వయసులోనూ ఒక్కరోజు సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానని తెలిపారు.

ఏ ఎన్నికలు వచ్చినా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. పార్టీలో చిన్నచిన్న భేదాభిప్రాయాలు, కొత్త–పాత అనే తేడాలను పక్కనపెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

**తప్పు చేశానని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా**

తనను 30 ఏళ్లుగా ప్రజలు చూస్తున్నారని పేర్కొన్న కడియం శ్రీహరి.. తాను ఏనాడైనా తప్పు చేశానా, పనులు ఇస్తాననో, పదవులు ఇస్తాననో, పథకాలు ఇప్పిస్తాననో ఎవరి దగ్గరైనా రూ.10 తీసుకున్నానా అని ప్రశ్నించారు. తాను తప్పు చేసినట్లు ఎవరైనా నిరూపిస్తే ముక్కు నేలకు రాసి రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు.

**తెలంగాణకు బీజేపీ ఏం చేసిందో చెప్పాలి**

తెలంగాణ ఏర్పాటునే బీజేపీ తప్పుపట్టిందని కడియం శ్రీహరి ఆరోపించారు. ప్రధాని మోదీ తెలంగాణను పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రానికి రూ.1,000 కోట్ల విలువైన ప్రాజెక్టు అయినా తీసుకొచ్చారా? ఒక జాతీయ సంస్థనైనా మంజూరు చేయించారా? అని ప్రశ్నించారు.

బండి సంజయ్, కిషన్ రెడ్డిలు తెలంగాణకు ఏం తీసుకొచ్చారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రాలకు వేల కోట్ల నిధులు మంజూరు చేస్తూ తెలంగాణకు మాత్రం మొండిచేయి చూపిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడమే బీజేపీ పనిగా పెట్టుకుందని విమర్శించారు.

**డబుల్ ఇంజిన్ రాష్ట్రాలు తెలంగాణతో ఎందుకు పోటీపడలేకపోతున్నాయి?**

డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలు అభివృద్ధిలో తెలంగాణతో ఎందుకు పోటీపడలేకపోతున్నాయని కడియం శ్రీహరి ప్రశ్నించారు. తలసరి ఆదాయం, అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉందని ఆయన పేర్కొన్నారు.

బీజేపీకి ప్రజలపై, రాజ్యాంగంపై నమ్మకం లేదని ఆరోపించారు. దళితులు, మైనారిటీలు, పేద ప్రజల హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం కల్పించిన హక్కులకు ముప్పు ఏర్పడుతుందని ఆరోపించారు.




భారతదేశ మనుగడకు, రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీని బలపర్చాల్సిన అవసరం ఉందన్నారు.

**బీఆర్ఎస్ నిరసనలకు కారణమేంటో ప్రజలకు చెప్పాలి**

బీఆర్ఎస్ పార్టీ ఎందుకు నిరసనలు చేస్తుందో ప్రజలకు వివరించాలని కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత ఆ పార్టీపై చేస్తున్న ఆరోపణలకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు సమాధానం చెప్పాలని సవాల్ చేశారు. 2014 ఎన్నికల అఫిడవిట్‌లో చూపించిన ఆస్తులు ఎన్ని, ప్రస్తుతం ఉన్న ఆస్తులు ఎన్ని అనే వివరాలను ప్రజల ముందు ఉంచాలని ప్రశ్నించారు. వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో ప్రజలకు వివరించిన తర్వాతే నిరసనలు చేయాలని అన్నారు.

**పార్టీ బలోపేతమే ఏకైక లక్ష్యం**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందని కడియం శ్రీహరి తెలిపారు. పార్టీ బలోపేతమే ఏకైక లక్ష్యంగా అందరూ ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

తాను కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లో పార్టీ తిరుగులేని విజయాన్ని సాధించిందని పేర్కొన్నారు. తనతో పాటు కాంగ్రెస్ పార్టీ బలం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో పెరిగిందన్నారు.

**చిల్పూర్‌లో రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు**

చిల్పూర్ మండలంలో రూ.50 కోట్లతో గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కడియం శ్రీహరి వెల్లడించారు. అతి త్వరలో అన్ని మండల కార్యాలయాలను చిల్పూర్ మండల కేంద్రంలో నిర్మించేందుకు శంకుస్థాపన చేసి, ఏడాదిలోగా నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. సెప్టెంబర్ 15లోగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను, సెప్టెంబర్ 30లోగా గ్రామానికి రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సమర్పించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు చిర్ర నాగరాజు, జిల్లా కమిటీ కార్యదర్శి గద్దమీది సురేష్, సీనియర్ నాయకులు బాలరాజు, కొత్తగా ఎన్నికైన సర్పంచులు, మండల అనుబంధ సంఘాల అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, సమన్వయ కమిటీ సభ్యులు, బీఎల్ఏలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల మహాగర్జనతో దద్దరిల్లిన సచివాలయం

- **న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి..**
- **ప్రభుత్వాన్ని కోరిన ఉద్యోగులు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉద్యోగుల న్యాయమైన హక్కులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'ఉద్యోగుల మహాగర్జన' కార్యక్రమం సచివాలయంలో భారీగా జరిగింది.

బాహుబలి గేటు వద్ద ఉద్యోగులు పెద్ద సంఖ్యలో చేరి నినాదాలతో సచివాలయ ప్రాంగణాన్ని హోరెత్తించారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటుతూ ఉద్యమ గీతాలు ఆలపిస్తూ తమ పోరాట పటిమను ప్రదర్శించారు.

**ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు**

- వేతన సవరణ సంఘం సిఫారసులను వెంటనే అమలు చేయాలి.
- పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను తక్షణమే విడుదల చేయాలి.






- పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ప్రస్తుత ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి.
- సచివాలయంలోని అన్ని ఉద్యోగ విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను తక్షణమే చేపట్టాలి.
- చందా ఆధారిత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, దాని స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి.

ఈ డిమాండ్లపై ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ "ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి.. న్యాయం చేయాలి" అంటూ తమ ఆవేదనను ప్రభుత్వానికి తెలియజేశారు.

అనంతరం బాహుబలి గేటు నుంచి మీడియా పాయింట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నినాదాలు చేస్తూ మీడియా పాయింట్‌కు చేరుకున్న ఉద్యోగులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

మీడియా పాయింట్ వద్ద సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గిరి శ్రీనివాస రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రేమ్, అధికారుల సంఘం అధ్యక్షుడు సురేష్ కుమార్, సంఘం అధ్యక్షురాలు రమాదేవి ప్రసంగించారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.ఏళ్ల తరబడి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇకనైనా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, వారి ఆవేదనను అర్థం చేసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను గుర్తుచేస్తూ, న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగుల మహాగర్జనతో తమ ఐక్యత, సంఘటిత శక్తిని ప్రభుత్వానికి స్పష్టంగా చాటామని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాల్సిన సమయం ఆసన్నమైందని సచివాలయ ఉద్యోగుల నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సచివాలయ అధికారులు, ఉద్యోగులు, మహిళా అధికారులు, మహిళా ఉద్యోగులు, శాసనసభ, లోక్‌భవన్‌కు చెందిన అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపించారు.

## శాతవాహన విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ధర్నా

- **భోజనశాల చార్జీలతో పాటు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**

**కరీంనగర్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

కరీంనగర్ నగరంలోని శాతవాహన విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. విద్యార్థి ఐక్య కార్యాచరణ సమితి నాయకుడు కరికే మహేష్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ పరిపాలనా భవనం ఎదుట విద్యార్థులు నిరసన చేపట్టారు.

ప్రధానంగా భోజనశాల చార్జీల సమస్యను పరిష్కరించడంతో పాటు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై కూడా విశ్వవిద్యాలయ అధికారులు తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని, విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొని తమ సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు.





## పెద్దతండాలో గ్రామసభ.. అభివృద్ధి పనులపై చర్చ

**సంగెం, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

సంగెం మండలం పెద్దతండా గ్రామపంచాయతీలో సర్పంచ్, ఉపసర్పంచ్ గుగులోత్ వినోద్ రవీందర్ నాయక్ దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ఎంపీడీఓ రవీందర్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రధానంగా వికసిత్ భారత్–ఉపాధి హామీ, జీవనోపాధి కార్యక్రమం (గ్రామీణ) కింద గ్రామంలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. గ్రామ అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వడం, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం, గ్రామంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనుల ఎంపిక తదితర అంశాలపై సభలో చర్చ జరిగింది.

గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామ అవసరాలకు అనుగుణంగా పనులను ఎంపిక చేసి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని అధికారులు సూచించారు. గ్రామస్థులు తమ సమస్యలు, అవసరాలను సభ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువతీ యువకులు, గ్రామాధికారులు, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, సాంకేతిక సహాయకుడు, క్షేత్ర సహాయకుడు, గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్


# తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ గవర్నర్

- కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు
- శ్రీవేంకటేశ్వర స్వామివారికి మొక్కులు
- తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు
- శివప్రతాప్ శుక్లకు ఆలయ మర్యాదలు



**తిరుమల, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**
తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్ల మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న గవర్నర్‌కు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్ల శ్రీవేంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక మొక్కులు సమర్పించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందజేయగా, గవర్నర్ భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారి అనుగ్రహం రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.
దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు గవర్నర్‌కు వేదాశీర్వచనం అందించారు. టీటీడీ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేసి సత్కరించారు. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా అన్ని మర్యాదలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, శాంతి, అభివృద్ధి కోసం స్వామివారి ఆశీస్సులు కోరినట్లు గవర్నర్ తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని, ప్రజల జీవితాల్లో సౌభాగ్యం నెలకొనాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, ఆయురారోగ్యాల కోసం కూడా ప్రత్యేకంగా ప్రార్థనలు చేసినట్లు తెలిపారు.
తిరుమల శ్రీవారి దర్శనానికి ప్రతిరోజూ దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడా తరచూ శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందుతుంటారు. ఈ నేపథ్యంలో తెలంగాణ గవర్నర్ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. గవర్నర్ శివప్రతాప్ శుక్ల కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో శ్రీవారిని దర్శించుకోవడం భక్తుల్లో ఆనందాన్ని కలిగించింది. దర్శనం అనంతరం ఆలయ పరిసరాలను సందర్శించిన గవర్నర్, తిరుమలలోని ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రశంసించారు. తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోసం తాను చేసిన ప్రార్థనలు ఫలించాలని ఆకాంక్షించారు.

# కంటోన్మెంట్ బొల్లారం ఆర్మీ స్థావరంలో ఆయుధాల చోరీ




**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చేట్లు):**
హైదరాబాద్ కంటోన్మెంట్ బొల్లారం ఆర్మీ స్థావరంలో ఆయుధాల చోరీ కలకలం రేపింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ఆయుధాల గదిలోకి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు.. తాళం పగులగొట్టి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు సమాచారం.
చోరీకి గురైన వాటిలో నాలుగు ఏకే47 రైఫిళ్లు, ఆరు పిస్టళ్లు, ఒక ఇన్సాస్ రైఫిల్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు ఆర్మీ అధికారులు గుర్తించారు. సోమవారం ఉదయం బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రక్షణ వ్యవహారం కావడంతో పోలీసులు కేసుకు సంబంధించిన వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. మద్రాస్ రెజిమెంట్‌లోకి అనుమతి ఉన్న సిబ్బందికి మాత్రమే ప్రవేశం ఉండటంతో.. చోరీకి అంతర్గత వ్యక్తుల ప్రమేయం ఉందా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.
ఆయుధాలు బరువుగా ఉండటంతో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది ఈ చోరీకి పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆయుధాల గది వద్దకు వచ్చిన సిబ్బంది, ఇతర అనుమతిపొందిన వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నారు.
రెజిమెంట్ పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు, ఆర్మీ అధికారులు పరిశీలిస్తున్నారు. మరోవైపు ఆర్మీ అధికారులు సిబ్బందిని అంతర్గతంగా విచారిస్తున్నారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య ఆర్మీ స్థావరంలోనే ఆయుధాలు చోరీకి గురికావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చోరీకి గురైన ఆయుధాలు ఎక్కడికి తరలించారు? ఈ ఘటన వెనుక ఎవరి ప్రమేయం ఉంది? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

# డివిజన్ అభివృద్ధికి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

- 27వ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం



**కరీంనగర్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**
కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 27వ డివిజన్ అభివృద్ధికి మరో అడుగు పడింది. డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు నగర పాలక సంస్థ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.
27వ డివిజన్‌లో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారుతాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి డివిజన్‌లో మిగిలిన అభివృద్ధి పనులను కూడా దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బోట్ల శ్యామల కిరణ్, నగర పాలక సంస్థ అధికారులు, స్థానిక ప్రజలు, డివిజన్ వాసులు తదితరులు పాల్గొన్నారు.




# పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా మహా ధర్నా

- పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి
- పెండింగ్ డిమాండ్లు పరిష్కరించాలి

**కరీంనగర్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**
పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు మహా ధర్నా నిర్వహించారు. జిల్లా ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపెల్లి ఖాళీ చరణ్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగుల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సుమారు 50 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల జిల్లా ఇన్‌చార్జి కోహెడ చంద్రమౌళితో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



# రాహుల్ గాంధీ పై ఎఫ్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలి

- శుద్ధీకరణ పేరుతో ఖర్గేను అవమానించడం హేయమైన చర్య
- రాష్ట్ర మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి
- ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 01(తెలంగాణ ముచ్చట్లు ):**
కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై అక్రమంగా పెట్టిన కేసును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ..ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో వరంగల్ క్రాస్ రోడ్ నుంచి మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ..కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కక్షపూరితంగా ఉత్తరాఖండ్ లోని హల్ద్వానీలో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న సభా వేదిక ప్రాంతాన్ని "శుద్ధి" చేస్తున్నామనే నెపంతో, దళితుడైన ఆయనను తీవ్రంగా అవమానించిన బీజేపీ నేతలపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, దళితులను అవమానించడం వారి అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు.
ఈ నిరసన కార్యక్రమంలో.. ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తోట వీరభద్రం, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ కిషోర్ నాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, సీనియర్ నాయకులు కళ్లెం వెంకటరెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్ లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, డివిజన్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదు


- మహేంద్ర భట్ వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి




**మహబూబాబాద్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**
దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలను సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న బహిరంగ సభ అనంతరం హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించినట్లు వెల్లడైన 'శుద్ధీకరణ' హవన్ వివాదంపై ఉత్తరాఖండ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మహేంద్ర భట్ చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం మహబూబాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిప్పర్తి శ్రీధర్ మాట్లాడుతూ.. ఆగస్టు 8న హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బహిరంగ సభలో పాల్గొన్నారని తెలిపారు. అనంతరం ఆగస్టు 10న అదే ప్రదేశంలో బీజేపీ అనుబంధ మత సంస్థ ఆధ్వర్యంలో 'శుద్ధీకరణ' పేరుతో హవన్ నిర్వహించినట్లు వార్తా కథనాలు వెల్లడించాయని పేర్కొన్నారు.
ఈ ఘటనను ఖర్గే తనను దళితుడిగా అవమానించే చర్యగా అభివర్ణించారని, ఈ అంశం రాజ్యసభలోనూ ప్రస్తావనకు వచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్ర భట్ శుద్ధీకరణ కార్యక్రమాన్ని సమర్థిస్తూ చేసినట్లు వెల్లడైన వ్యాఖ్యలు మరింత వివాదానికి దారితీశాయని అన్నారు.
రాజకీయ భేదాభిప్రాయాలు ఉండవచ్చని, అయితే కుల వివక్ష, అంటరానితనాన్ని ప్రోత్సహించే లేదా సమర్థించే చర్యలను ప్రజాస్వామ్య సమాజం సహించదని తిప్పర్తి శ్రీధర్ పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి ప్రసాదించిన సమానత్వ హక్కులను, దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే హక్కు ఎవరికీ లేదన్నారు. మహేంద్ర భట్‌పై వచ్చిన ఆరోపణలు, ఆయన చేసినట్లు వెల్లడైన వ్యాఖ్యలు, హల్ద్వానీ ఘటనకు సంబంధించిన పూర్తి అంశాలపై సమగ్ర విచారణ జరిపి, ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం కింద వర్తించే నిబంధనలను పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.
దళితుల గౌరవాన్ని కాపాడటంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ముందుండి పోరాడుతుందని, దళితులపై వివక్షకు వ్యతిరేకంగా అవసరమైతే చట్టపరమైన అన్ని మార్గాల్లో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు గాడిపల్లి వెంకన్న, బల్లెం చంటి, పడిశాల వెంకన్న, పడిశాల జాన్, పొలిపాక అమరేందర్, షాకుల అజయ్, మంద పవన్, శ్రీనివాస్, ధనాబోయిన బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సీసీటీవీ కెమెరా సర్వీసింగ్‌కు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉంది

- యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే శిక్షణా కోర్సులపై దృష్టి పెట్టాలి
- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి




**కామారెడ్డి, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**
నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సీసీటీవీ కెమెరా సర్వీసింగ్ శిక్షణ పొందిన మొదటి బ్యాచ్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి హాజరై శిక్షణార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో సీసీటీవీ కెమెరాల వినియోగం విస్తృతంగా పెరుగుతున్న నేపథ్యంలో వాటి ఏర్పాటు, నిర్వహణ, మరమ్మతులు, సర్వీసింగ్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు. యువత ఇటువంటి ఉపాధి ఆధారిత శిక్షణలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని సూచించారు.
శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను ఆచరణలో పెట్టి సొంతంగా ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని ఆమె కోరారు. గ్రామీణ ప్రాంత యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించడంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ అమర్ సింగ్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజయ్య, అధ్యాపకులు జీవన్ నాయక్, సూర్య తేజ, జిల్లా శిక్షణ సమన్వయకర్త రాజశేఖర్ రెడ్డి, సంస్థ ప్రతినిధి సార్ధిక, శిక్షణార్థులు తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in